క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మేయర్

బడంగ్‌పేట్: అన్ని డివిజన్లలో సీసీరోడ్లతో పాటు బీటీరోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు వేగంగా జరుగుతున్నాయని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ అన్నపూర్ణనగర్, శ్రీవిద్యా టౌన్‌షిప్ కాలనీల్లో ఆమె సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజలు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మాధవరెడ్డి



తుక్కుగూడ: బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మున్సిపాలిటీ పరిధి రావిర్యాల గ్రామానికి చెందిన జె.మాధవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తన పదవి కోసం సహకరించిన పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

మీర్‌పేట: ఆపదలో ఉన్న నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ ఓల్డ్ బాలాజీనగర్‌కు చెందిన శ్యామ్‌రావు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు లక్షల్లో డబ్బు కావాల్సి ఉంది. దీంతో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు బాలకిషన్ ద్వారా ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా.. సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల 50 వేల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. శుక్రవారం ఎల్‌ఓసీ పత్రాన్ని శ్యామ్‌రావుకు ఎమ్మెల్సీ అందజేశారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్రిస్టియన్ జేఏసీ నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడలోని వాయిస్ ఆఫ్ ఇమ్మానుయేల్ ప్రార్థన మందిర ఆవరణలో శుక్రవారం క్రిస్టియన్ తెలంగాణ జేఏసీ రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్‌ను రాష్ట్ర చైర్మన్ రవికుమార్, ఉమ్మడి జిల్లా చైర్మన్ రమేష్‌లు ఆవిష్కరించారు. జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జేఏసీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ ఫలాలు అందిచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా జేఏసీ కన్వీనర్ సీహెచ్ జాన్, జిల్లా కోఆర్డినేటర్ ఎదురుగట్ల ఆనందరావు, పాస్టర్ పాల్, బ్రదర్ లింగస్వామి, బ్రదర్ ప్రేమ్‌కుమార్, సిస్టర్ జయ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ కాల్వలు శుభ్రం



సాక్షి ఎఫెక్ట్..

తుక్కుగూడ: 'ప్లాస్టిక్‌తో పరిసరాలకు ముప్పు' అనే శీర్షికన ఈ నెల 23న 'సాక్షి'లో ప్రచురించిన వార్తా కథనానికి తుక్కుగూడ మున్సిపల్ అధికారులు స్పందించారు. ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపులా నీరు పారడానికి ఏర్పాటు చేసిన కాల్వల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తా చెదారాన్ని శుక్రవారం కమిషనర్ బి.వెంకట్రామ్ మున్సిపల్ సిబ్బందితో తొలగింపచేశారు.

అనువైన చోటే.. అయినా ఆపరు

- మండల కేంద్రంలో ఆగని ఎక్స్‌ప్రెస్ బస్సులు.. చేయెత్తినా పట్టించుకోని సిబ్బంది
- అడిగిన వారికి నిర్లక్ష్య సమాధానమే
- నయానగరి నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం
- మెరుగుపడని రవాణా సౌకర్యం



యాచారం ఆర్టీసీ బస్టాండ్




బస్టాండ్‌లోకి రాకుండా వెళ్తున్న డీవీకే ఎక్స్‌ప్రెస్ బస్సు

యాచారం: నిత్యం వందల కొద్ది ఆర్టీసీ బస్సులు నాగార్జునసాగర్–హైదరాబాద్ హైవేపై రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ.. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోకి రావు. చేయెత్తినా నిలపరని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. దేవరకొండ డిపోనకు చెందిన సర్వీసులు దేవరకొండ నుంచి ఎంజీబీఎస్ వరకు మాల్, తమ్మలోనిగూడ, చింతపట్ల, తక్కళ్లపల్లి, యాచారం, గునుగల్, ఆగాపల్లి, ఇబ్రహీంపట్నం, మంగల్‌పల్లి, బొంగ్లూర్, తుర్కయంజాల్, బీఎన్‌రెడ్డి, సాగర్‌రింగ్‌రోడ్డు, సంతోష్‌నగర్, మలక్‌పేట, ఎంజీబీఎస్ వరకు రాకపోకలు సర్వీసులు పరుగులు తీస్తుంటాయి. కానీ.. మండల కేంద్రంలో ఆ డిపో బస్సులు ఆపకపోవడం వలన ప్రాంత ప్రయాణికులకు రవాణా కష్టాలు వెంటాడుతున్నాయి. ఒక వేల ఆపినా ప్రయాణికుల పట్ల ఆర్టీసీ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. బీఎన్‌రెడ్డి నగర్ నుంచి మాల్ వరకు దేవరకొండ బస్సుల్లో ప్రయాణికులు, సంస్థ సిబ్బంది మధ్య నిత్యం ఘర్షణలు చోటుచేసుకుంటున్నట్లు సమాచారం.

ప్రయాణ ప్రాంగణంలో వచ్చేలా..

సాగర్‌రోడ్డుపై పరుగులు తీసే ప్రతి ఆర్టీసీ బస్సును మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలోకి వచ్చివెళ్లేలా చర్యలు తీసుకోవాలని సంస్థ అధికారులను మండల ప్రజలు కోరుతున్నారు. తాజాగా మండలం సమీపంలోని నయానగరి పట్టణ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సమయంలో రవాణా సౌకర్యం చాలా అవసరం. వేలాది మంది కార్మికులు, వ్యాపారం, ఉద్యోగ రిత్యా స్థానిక బస్టాండ్ నుంచి నిత్యం సుమారు వేలాది సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇక విద్యార్థుల సంఖ్య మరింత అధికంగానే ఉంటుంది. కావున దేవరకొండ డిపోతో పాటు ఏపీకి చెందిన మాచర్ల, కనిగిరి తదితర డిపోల బస్సులకు ఇక్కడ హాల్టింగ్ ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదులు నిజమే



బస్టాండ్‌లోకి దేవరకొండ డిపోనకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు రావడం లేదని ప్రయాణికుల నుంచి ఫిర్యాదు అందాయని ఆ డిపో మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు. కొందరు డ్రైవర్లు ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఈ అంశంపై సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చామని పేర్కొన్నారు. పక్షం రోజుల పాటు బస్టాండ్‌లో డీవీకేకు చెందిన సిబ్బందిని నియమించి, ప్రతి బస్సు ఆగేలా కృషి చేస్తామన్నారు. బస్టాండ్ నోటీసు బోర్డుపై డీవీకే బస్సులు యాచారం బస్సాండ్‌లోకి వెళ్లాలని పేర్కొంటూ వివరణ అంటించామని వెల్లడించారు.

ప్రతి బస్సు నిలపాలి



మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఉన్నప్పటికీ దేవరకొండ డిపోనకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపడం లేదు. చేయెత్తినా పట్టించుకోరు. డ్రైవర్లు, కండక్టర్ల దురుసు ప్రవర్తనతో ఆర్టీసీ ఆదాయం కోల్పోతోంది. డీవీకే మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం కానరావడం లేదు. ప్రయాణ ప్రాంగణంలో ప్రతి బస్సు నిలిపేలా సంస్థ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– మేకల యాదగిరిరెడ్డి, ప్రయాణికుడు, మొండిగౌరెల్లి

బొమ్మల చెరువును పరిరక్షించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఆక్రమణదారుల చెర నుంచి బొమ్మలచెరువును పరిరక్షించాలని మండల పరిధి పిగ్లీపూర్ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ రవీందర్ దత్తుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 46లో సుమారు 22.11ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును కొంత మంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిని మట్టితో నింపివేస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేయించి, ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

దళితులకే కేటాయించాలని వినతి



ఖానాపూర్ బాధితుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: ఖానాపూర్‌లో కబ్జా చేసిన దళితుల భూములను తమకే ఇప్పించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఇబ్రాం శేఖర్‌కు బాధిత రైతులు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని డిప్యూటీ మేయర్ చాంబర్‌లో ఖానాపూర్ బాధితులు ఇబ్రాం శేఖర్‌తో మాట్లాడారు. తమకు అండగా ఉండి న్యాయం చేయాలని, లేనియెడల పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఖానాపూర్ గ్రామంలోని సర్వేనెంబర్ 16, 18, 20లో ఎంతో కాలం నుంచి తాము సాగుచేసుకుంటున్న అసైన్డ్ భూములను అదే గ్రామానికి చెందిన కొందరు భూస్వాములు స్వాధీనం చేసుకుని పట్టాలుగా మార్పులు చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం అసైన్డ్ భూములను అమ్మడం కానీ, కొనడం కానీ విరుద్ధమన్నారు. ఈ విషయంలో అసైన్డ్ భూములని తెలిసి కూడా పట్టాలుగా మార్పులు చేసిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాత పింఛన్ పునరుద్ధరించాలి



ఇబ్రహీంపట్నం: పట్నం డిగ్రీ కళాశాల ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

ఇబ్రహీంపట్నం: పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి డా.చింతల రాకేశ్ భవాని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్నం డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి, విధుల్లో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. సీపీఎస్ ఒప్పందం ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాల్లో చీకటి నింపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు డీవీ రావు, నరేందర్‌రెడ్డి, సురేష్, రమేష్, సురేఖ, శంకర్, ధనరాజ్, పవన్ కుమార్, శ్రీకృష్ణ, వీరారెడ్డి, రవికుమార్, కళ్యాణి, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మంచాలలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ సంఘం తీర్మానం మేరకు జీఓ 28కి వ్యతిరేకంగా ఆగస్టు 23న బ్లాక్ డేగా పాటించామని తెలిపారు. గత ప్రభుత్వం తెచ్చిన జీఓను రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగులకు చీకటి రోజు అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ఇచ్చిన మాట ప్రకారం కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి మాట నిలబెట్టుకోవాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధి చెన్నంపల్లిలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగ జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం జలధివాసం నిర్వహించారు. పండితులు నరసింహయ్య శర్మ, యాదగిరిల ఆధ్వర్యంలో గణపతి పూజ, యాగశేల, అగ్నిప్రతిష్ఠ, పంచగవ్య అధివాసం, ధాన్యాధివాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, లక్ష్మీ నారాయణగౌడ్, తిరుపతయ్య, శ్రీను, కృష్ణయ్య, రామస్వామి, నరేందర్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కందుకూరు: మండల పరిధి వివిధ విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం సరఫరాలో విద్యుత్ అంతరాయం కలగనుందని ఏఈ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కందుకూరు టౌన్-2, 11కేవీ దెబ్బడగూడ ఏజీఎల్ ఫీడర్ల పరిధిలోని 33కేవీ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కేవీ దెబ్బడగూడ ఏజీఎల్, 11కేవీ మహ్మద్‌నగర్ ఫీడర్ల పరిధిలో, 11కేవీ నేదునూరుటౌన్, మాన్యగూడ, అలీఖాన్‌పల్లి ఫీడర్లలో కొత్త సర్వీసుల పని నిమిత్తం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని వెల్లడించారు. 11కేవీ రాచులూరు టౌన్, ఏవీఆర్ ఫీడర్లలో లైన్ షిఫ్టింగ్‌ల నిమిత్తం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ ఎల్.వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీనగర్, హార్డ్‌వేర్ పార్కు-2, ముదిరాజ్ కాలనీ, ఉమర్ కాలనీ, అబ్బుషేర్ కాలనీల్లో సరఫరాను నిలివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రైతు ధర్నాలో రాజకీయ నిరుద్యోగులే

మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించిన రైతు ధర్నాలో బీఆర్‌ఎస్ రాజకీయ నిరుద్యోగులే తప్పా రైతులు పాల్గొనలేదని మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులకు 10 ఏళ్ల రైతులు గుర్తుకు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే కేటీఆర్‌కు రైతులు గుర్తొచారని విమర్శించారు. రైతు రుణాలను రూ.2లక్షల వరకు తప్పకుండా ఏకకాలంలో మాఫీ చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని హామీలను పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రామిడి కృష్ణారెడ్డి, సోనునాయక్, వెంకటేష్‌గౌడ్, రమేష్‌నాయక్, నవీన్, నరేష్, జంగయ్యగౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు రూ. లక్ష విరాళం

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలో ఈ నెల 24 నుంచి నిర్వహించే బోనాల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం పోచమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులకు కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ సత్యం యాదవ్, సభ్యులు రాములు, నరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, వెంకటేశ్, యాదయ్య, రాములు, వెంకటేశ్, కార్తీక్, శ్రీను, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేది అధికార దాహం

- ఇక్కడ గెలిచి.. అక్కడి వారి కోసం పోరాటమా?
- సబితకు మహేశ్వరం ప్రజలపై ప్రేమలేదు
- సబితారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ మండిపాటు



మహేశ్వరం: ఎమ్మెల్యే సబితారెడ్డికి అధికార దాహమే తప్ప నియోజకవర్గ ప్రజలపై ప్రేమ లేదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సబితారెడ్డి మహేశ్వరం ఎమ్మెల్యేగా గెలుపొంది, చేవెళ్ల రైతుల కోసం పోరాటం చేస్తుందని విమర్శించారు. రైతుల రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నేతలు ఎవరి నియోజకవర్గాల్లో వారు ధర్నాలు చేస్తే, సబితారెడ్డి మాత్రం మహేశ్వరంలో ధర్నా చేయకుండా చేవెళ్లలో కూర్చున్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడి ప్రజలతో అధికారం చేపట్టిన ఆమె.. పక్క నియోజకవర్గంలో నిరసన వ్యక్తం చేయడమేంటని ప్రశ్నించారు. కేఎల్ఆర్ భయానికి ఆమె నియోజకవర్గం మారనుందన్న అనుమానం వస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ముచ్చర్ల ఫోర్త్‌సిటీ ఇన్‌చార్జిగా తనను ప్రకటిస్తే సబిత జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఆమెను ఇక్కడి ప్రజలు చేవెళ్లకు పంపిస్తారని వెల్లడించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ

మహేశ్వరం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లకు వారి కేంద్రానికి సంబంధించి ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు తినేలా ప్రోత్సహించాలని, పిల్లల హాజరు శాతం పెంచాలని, ప్రీ స్కూల్ మెటీరియల్‌ను చిన్నారులకు అందజేయాలని సూచించారు. పట్టిక ప్రకారం పిల్లల బరువు, ఎత్తు కొలవాలని చెప్పారు. అంతకు ముందు పూర్వ ప్రాథమిక విద్య, టైమ్ టెబుల్‌ను వివరించారు. ఎంపీడీఓ శైలజ, దుబ్బచర్ల ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ అధికారి డా.మల్లికార్జున్, హెల్త్ సూపర్‌వైజర్ నర్సింలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని నిరసన



నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకుడు ఎండీ బషీర్ మాట్లాడారు. సీపీఎస్ విధానంతో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. జీఓ నంబర్ 28ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌శర్మ, ఉపాధ్యాయులు విజయ్‌మోహన్‌రెడ్డి, సురేష్, గ్లోరీ, కౌసల్య, ఎండీ అబ్దుల్లా, కరుణాకర్, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



లేమూరులో నూతన బస్సుకు పూజలు చేసి ప్రారంభిస్తున్న అధికారులు, గ్రామస్తులు

కందుకూరు: ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లేమూరు మాజీ సర్పంచులు జి.కొండారెడ్డి, ఢిల్లీ గణేష్ కోరారు. మిథాని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసును ఉమెన్స్ కాలేజ్ నుంచి లేమూరు వరకూ రోజూ మూడు ట్రిప్పులు తిరిగేలా అధికారులు ఏర్పాటు చేశారు. శుక్రవారం మండల పరిధిలోని లేమూరుకు నూతనంగా వచ్చిన ఆ సర్వీసు బస్సును గ్రామస్తులతో కలిసి వారు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం శుభపరిణామమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గుర్విజైపాల్, మల్లేష్, గుర్వి యాదయ్య, కడారి గణేష్, ఎస్.మల్లేష్, సీహెచ్ కృష్ణ, కె.పొన్నమ్మ, కె.శైలజ, కె.రాములమ్మ, గుర్వి జంగయ్య, గుర్వి రమేష్, బాబురావు, దర్శన్, సబిత, జంగయ్య, సుజాత, జంగమ్మ, నర్సింహా, మురళీ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతిలో సాగు చేయాలి

- అధిక దిగుబడితో మంచి లాభాలు పొందండి
- పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

మంచాల: ఆధునిక పద్ధతుల్లో రైతులు పంటలను సాగుచేయాలని పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రైతు వేదిక భవనంలో మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, క్రిషి జాగ్రన్, క్రిషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటల సాగు విషయంలో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను సాగు చేసి, అధిక లాభాలు పొందాలని చెప్పారు. రైతు సంక్షేమం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం వ్యవసాయ అధికారులు చంద్రకాంత్, సుధీర్, మాధవీలత, విజయ్‌కుమార్, దిలీప్ ఆధునిక పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు లింగ స్వామి, సాయిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

- బీఆర్‌ఎస్ నాయకుల మాటలను నమ్మకండి
- క్రమంగా అర్హులందరికీ లబ్ధిచేకూరుతుంది
- రైతులకు సూచించిన కాంగ్రెస్ శ్రేణులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: రైతు రుణమాఫీపై ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలు ఆరోపించారు. శుక్రవారం వారు మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు. మాఫీ దిగ్విజయంగా జరగడంతో ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. మాఫీ విషయంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావ్‌లు విష ప్రచారం చేస్తూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో రైతులను మోసగించిన బీఆర్‌ఎస్ పార్టీకి రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఆ నేతల మాటలను నమ్మి రైతులు మోసపోవద్దని, అర్హులందరికీ రుణమాఫీ వస్తుందని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మాజీ ఎంపీపీ ధనుంజయ, నాయకులు పర్వతాలు, బలరాం, కాలె మల్లయ్య తదితరులు ఉన్నారు.